# అంతరాలు

పూజ ముగించి అభిషేకం చేసిన స్ఫటిక లింగాన్ని ఐంధ్యంలోని వెండిభరిణలో పెట్టి పీటమీద చేయి ఊతగా వేసుకొని లేచారు సదాశివంగారు. తడిపై పంచను తీగమీద ఆరవేస్తుండగా

"అయ్యగారూ! మీకోసం ఆచారిగారు వచ్చున్నారండీ" అని చెప్పాడు పనివాడు. రెండుగదుల అవతల నిలబడి "కూర్చోమను వస్తున్నా" అంటూ వంట గదిలోకి నడిచారు.

"ఏమిటోయ్ ఈ రోజు వంట ఘుమ ఘుమలాడు తోంది! ఏమిటి విశేషం! మీ అబ్బాయి, కోడలు వస్తున్నారా? ఏమిటి?" నవ్వుతూ అడిగారు. ఇత్తడి పళ్ళెంలో పులిహోర కలుపుతున్న పార్వతమ్మగారు తలెత్తిచూసారు! కొద్దిగా పసుపు రాసిన ముఖంలో చిరుచెమటకి కరిగిన నయాపైసా అంత బొట్టు కొంచెం కరిగింది. ఆమె కట్టుకున్న పసుపురంగు నేత చీర ఒంటిరంగుతో పోటీపడుతోంది. చేతులనిండా గాజులు, పసుపురాసిన పాదాలకు మెట్టెలు. జారుముడితో అపరపార్వతీదేవిలా ఉందామె.

'ఈ రోజు శంకర జయంతి' కదా! అంటూ మళ్ళీ పులిహోర కలపసాగింది.

"అదేనోయ్ నేనడిగేది. ఎప్పుడూ ఏపండక్కీ లేని ప్రత్యేకత ఈ రోజు ఏమిటా? అని" చటుక్కున ముఖాన్ని పక్కకు తిప్పుకుంది పార్వతమ్మ. ఒక్క క్షణం కలవర పడ్డారు సదాశివంగారు. భారంగా నిట్టూర్పు బయటికి వచ్చారు.

అరుగుమీద కూర్చున్న ఆచారిగారిని చూసి "నమస్కారం ఆచారిగారూ! చాలా రోజులకు కనిపించారు! ఈ మధ్య గుళ్ళో కూడా కనిపించడం లేదు." అంటూ కూర్చున్నారు సదాశివంగారు.

"అమ్మాయికి సంబంధం ఒకటి వస్తే భావనాపురం వెళ్ళానండీ. మా తమ్ముడు ఉండేదీ అక్కడే. నాలుగు రోజులు అక్కడ ఉండి వచ్చాను," అన్నారు ఆచారిగారు.

"అయితే త్వరలో మాకు విందు భోజనమన్న మాట పెళ్ళి ఏప్పుడనుకుంటున్నారు?"

"ఇంకా ఎటూ తేలలేదండీ. వాళ్ళు పాతికవేలంటున్నారు. నాకా అంత స్తోమత లేదు. తమ్ముడూవాళ్ళు మాట్లాడి ఉత్తరం రాస్తామంటే వచ్చేసాను. ఇక్కడ నా భార్య ఆరోగ్యం అంతంత మాత్రం. ఏదో మేము కన్ను మూసే లోపల దాని పెళ్ళయితే మాకు నిశ్చింత" అన్నారు ఆచారిగారు.

"బాధపడకండి ఆచారిగారూ! మన చేతుల్లో ఏముంది? అంతాదైవేచ్ఛ" అంటూ నశ్యం డబ్బా చేతిలోకి తీసుకున్నారు సదాశివంగారు.

"మీలాగా అన్నిటికీ దేవుడి మీద భారం వేసి నిశ్చింతగా ఉండే గుండెదిటవు నాకు లేదండీ" ఆమాట చురుక్కుమని తగిలింది సదాశివం గారికి. "ఇంక నేను బయల్దేరతానండీ. సాయంత్రం గుళ్ళో కలుస్తాను" అంటూ వెళ్ళారు ఆచారి. ఆయన వెళ్ళిన వైపే ఒక్క నిముషం చూచి ఆలోచనలో పడిన సదాశివం గారు "అయ్యగారూ! అమ్మగారు భోజనానికి లేవమంటు న్నారండీ" అన్న పనివాడి పిలుపుతో 'వడ్డించమను వస్తున్నా' అంటూ లేచారు.

వంటగదిలో పీటవేసి వెండికంచంలో అన్నీ వడ్డించింది పార్వతమ్మ. "నువ్వూ వడ్డించుకోలేదేం పార్వతీ!"

"నేను తర్వాత తింటాను లెండి ఆకలిగా లేదు" అంటూ నెయ్యి అభికరించింది.

"కొత్తగా మాట్లాడు తున్నావు పార్వతీ! ఎప్పుడైనా ఇద్దరం చెరొకసారీ భోంచేయడం జరిగిందా! నువ్వూ వడ్డించుకో" అన్నారు. ఇద్దరూ మౌనంగా భోజనం ముగించారు. పనివాడు మధ్య హాల్లో మంచం వాల్చి దిండ్లు వేసి ఉంచాడు. పార్వతమ్మ పనివాడికి అన్నంపెట్టి, వంటిల్లు సర్దుకొని వత్తుల డబ్బా తీసుకొని వచ్చి తలుపుకు ఆనుకొని వత్తులు చేస్తోంది. మాటిమాటికి చెమర్చే కళ్ళను ఒత్తుకోసాగింది.

"పార్వతీ!" పిలిచారు సదాశివంగారు. 'ఆ..' అంది కానీ తలెత్తి చూడలేదామె. చూస్తే కన్నీళ్ళు భర్త కంట పడతాయని ఆమె భయం.

"పార్వతీ! ఉదయం నుండీ నువ్వు బాధపడడం చూస్తున్నాను. ఈ రోజు మనమ్మాయి త్రివేణి పుట్టినరోజని నాకూ తెలుసు: బాధపడి మనసుపాడు చేసుకున్నంత మాత్రాన జరిగిపోయిన కాలం తిరిగి వస్తుందా? మనమను కున్నట్లు జరుగుతుందా? మనచేతుల్లో ఏముంది? నువ్విప్పుడు కళ్ళనీళ్ళు పెట్టుకున్నంతమాత్రాన ప్రయోజనం ఏముంది చెప్పు?" అన్నారు సదాశివంగారు.

"మీకు తెలీదండీ నా బాధ. నేను దానికేం తక్కువ చేసానని నాకీ శిక్ష వేసింది? ఒక్కగానొక్క ఆడపిల్లని అరచేతుల్లో పెట్టుకొని పెంచానే! అది ఒక్కో తరగతి ఫస్టున పాసవుతుంటే నా బిడ్డ చదువుల తల్లని మురిసి పోయాను. పెద్దాడికి మటుకు అదంటే ఎంత ఆపేక్ష! అనలు కాశీనాథుని వారంటే ఎంతపేరు! దానిమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాము. నా నమ్మకాన్ని వమ్ముచేసి, నా ఆశల్ని దెబ్బకొట్టి ఎవడో మతంకాని మతం వాణ్ణి చేసుకొని నా గుండె బద్దలు చేసింది చాలక ఈ ఊళ్ళోనే ఉండడానికి దానికెంతధైర్యం! మన పరువు ప్రతిష్ఠల్ని మంట గలిపి ఊళ్ళో తలెత్తుకోకుండా చేసింది. నన్నింత క్షోభపెట్టిన అదేం బాగుపడు తుందండీ!" ఆవేశంగా అంది పార్వతమ్మ.

"పార్వతీ!" వారించారు సదాశివంగారు "వద్దు పార్వతీ! తల్లి శాపానికి తిరుగు లేదంటారు. బిడ్డల్ని కంటాము కానీ వాళ్ల రాతల్ని కనగలమా! మనబిడ్డ మన ఆశల్ని అడియాసలు చేసింది నిజమే. కానీ జరిగిపోయినదాన్ని గురించి బాధపడి ప్రయోజనమేముంది.. చెప్పు పార్వతీ. మన తరానికి ఈ తరానికి ఆలోచనల్లో, ఆచరణలో ఎంతో అంతరముంది. 'మారే కాలంతో మారడం మన ధర్మం. ఏం చేసినా అది మన బిడ్డ. ఎక్కడున్నా అది సుఖంగా ఉంటే చాలు. లేదా! మాకసలు త్రివేణి అనే బిడ్డే పుట్టలేదనుకో."

"మీరు పురాణాలు, పుస్తకాలు చదవడంతో అన్నీ తేలిగ్గా తీసుకోగలరు. కానీ నేను దాన్ని కన్న తల్లినండీ. అది 'అమ్మా' అని పిలుస్తున్నట్లే ఉంది. ఇరవైయ్యేళ్ళొచ్చినా నాకొంగు పట్టుకొని తిరిగేది. వయసొచ్చినా చిన్న పిల్లలాగా బొమ్మలతో ఆడుకునేది. అదుగో ఆ బీరువాలో బొమ్మలన్నీ దానివే. ఇంట్లో ప్రతి వస్తువూ దాన్ని జ్ఞాపకం చేస్తుంది. ఆఖరికి దాహం వేసినా సగం రాత్రిలో నన్ను లేపేది. అలాంటిది. ఇంత పని చేసిందా! అది వాడిని చేసు కుంటానన్న రోజే ఈ పాపిష్టి గుండె ఎందుకాగిపోలేదో! వద్దండీ ఈ బాధ పగవాడికి కూడా వద్దు." కొంగుతో ముఖం దాచుకుందామె.

"పిచ్చి పార్వతీ! ఆడదానివి కాబట్టి నువ్వు పైకి ఏడుస్తున్నావు. మగవాడిని కనుక నేను లోలోపల కుమిలి పోతున్నాను. నిజంగా ఆలోచిస్తే త్రివేణి జ్ఞాపకాలు నీకన్నా నాకే ఎక్కువ. రోజూ నాకు పూజకు కావలసిన సామగ్రి అంతా సిద్ధంచేసి ఉంచేది. రాత్రి పన్నెండు గంటల వరకు పెరట్లో మంచం వేసుకొని ఎన్నెన్ని విషయాలు చర్చించుకునేవాళ్ళం! అప్పుడు నువ్వు 'తండ్రీ కూతుళ్ళిద్దరూ ఈరోజు నిద్రపోయేదేమన్నా ఉందా!" అని విసుక్కుంటే నవ్వుకునేవాళ్ళం. ఏవీ ఆరోజులు! మళ్ళీ ఇక రావేమో". దీర్ఘంగా నిట్టూర్చి కళ్ళు తుడుచు కున్నారాయన.

కంగారు పడింది పార్వతమ్మ "పాపిష్టిదాన్ని పోయినదాని కోసం నేనేడ్చి అనవసరంగా మిమ్మల్ని బాధపెట్టాను. కాసేపు పడుకోండి. సాయంత్రం గుడికి వెళ్లారు కాబోలు" అంటూ వత్తులన్నీ సర్ది డబ్బామూసి లోపలికి తీసుకెళ్ళింది పార్వతమ్మ.

* * *

ఆ రోజు సాయంత్రం...

పార్వతీ! నేను రావడం ఆలస్యమైతే ఖంగారు పడకు వస్తూ పరాశరం గారింటికి వెళ్ళి వస్తాను" అంటూ పై పంచ సర్దుకొని గుడికి బయలు దేరారు సదాశివంగారు.

శివాలయం చేరుకునే సరికి కొద్దిగా చీకటి పడింది. గర్భగుడి దగ్గరికి వెళ్ళి దైవదర్శనం చేసుకుని కళ్ళు మూసుకుని నమస్కరిస్తున్న సదాశివంగారు, ప్రక్కన, 'కాశీనాథుని సదాశివంగారు, కౌశికస గోత్రం భరణీ నక్షత్రం" అంటూ అర్చనకు తన పేరు చెప్పడం వినిపించి కళ్ళు తెరిచి చూశారు. ప్రక్కన నిలబడి ఉన్నాడు విల్సన్. అతనే త్రివేణి భర్త. ఆశ్చర్యంగా చూస్తున్న సదాశివంగారిని చూచి పలకరింపుగా నవ్వాడు. సదాశివంగారు త్రివేణి వచ్చిందేమోనని చూసారు. కనిపించలేదు. నెమ్మదిగా వచ్చి బిల్వవృక్షం క్రింద ఉన్న అరుగు మీద కూర్చున్నారు. 'విల్సన్. క్రిష్టియన్. అతనేమిటి? గుడికి రావడమేమిటి? తనపేరు మీద అర్చన చేయించడమేమిటి? మరి త్రివేణి రాలేదేమి?' ఇలా ఆలోచనల్లో మునిగిపోయిన సదాశివం గారు,

"నమస్కారం మావగారూ" అన్న పిలుపుతో ఉలిక్కి పడి చూసారు. విల్సన్ నిలబడి ఉన్నాడు.

"ఎలా ఉన్నారండీ?" అంటూ పక్కన కూర్చున్నాడు. 'బాగున్నాం' అన్నట్లుగా తల ఊపారు.

'త్రివేణి పుట్టిన రోజు నాడు గుళ్ళో అర్చన చేయించే అలవాటు వుందటగా. తనకు ఈ మధ్య వంట్లోబాగుండడం లేదు."

"ఒంట్లో బాగా లేదా? ఏమయింది?" ఆత్రుతగా అడిగారు సదాశివంగారు.


"చూశారా! ఇప్పటి వరకు నోరు మెదపని వారు, నేను నవ్వినా నవ్వలేదు. త్రివేణికి బాగా లేదనగానే మీకు తెలీకుండానే మాట్లాడేసారు." నవ్వుతూ కొబ్బరి ముక్క అందించాడు విల్సన్. "ఖంగారు పడకండి. త్రివేణికి కొంచెం నలతగా ఉంది. అందుకే నేను గుడికి వచ్చాను."

"ఇప్పుడెలా ఉంది?" ఇంకా ఖంగారు తగ్గలేదు సదాశివంగారికి.

"ఫరవాలేదు బాగుంది. కానీ మిమ్మల్ని వాళ్ళ అమ్మ గారిని చూడాలని కలవరిస్తోంది. ఇలాంటి సమయంలో ఆడవాళ్ళ కోరికలు తీర్చాలంటారు. కానీ ఇది తీర్చలేని కోరిక." అన్నాడు విల్సన్. ఆశ్చర్యంగా చూస్తున్న సదాశివం గారితో "అవునండీ. త్రివేణి ఇప్పుడు గర్భవతి. నాలుగోనెల అన్నాడు డాక్టర్. చాలా నీరసంగా వుంది. నాకు ముందు వెనుక ఎవరూ లేరు. మీకు అభ్యంతరం లేకపోతే ఒకసారి ఇంటికి వస్తారా! మిమ్మల్ని చూస్తే తనకు కొంచెం తృప్తిగా వుంటుంది" అన్నాడు విల్సన్. ఒక్క అయిదు నిముషాలపాటు ఏమీ సమాధానం చెప్పలేదు సదాశివంగారు.



## వి. వసంతలక్ష్మి



"మరి నేను వస్తానండీ" అంటూ లేచాడు విల్సన్.

"ఆగు బాబూ! ఇల్లు దగ్గరేనా! నేనూ వస్తాను" అంటూ పైపంచ దులిపి భుజానవేసుకొని బయలు దేరారు సదాశివంగారు.

"లోపలికి రండి మాష్టారూ" అంటూ ఆహ్వానించాడు. చిన్న ఇల్లు. పొందిగ్గా వుంది. హాల్లో పేముతో చేసిన కుర్చీలు చిన్న టీపాయ్ మీద ఫ్లవర్‌వాజ్‌లో రెండు ఎర్రగులాబీలు. గోడలకి చక్కటి చిత్రాలు. గదిలో ఓమూల చిన్న టేబుల్ మీద ఏసుక్రీస్తు, శంకరాచార్య, మక్కామసీదు ఫొటోలు ఉన్నాయి.

"అలా నిలబడి పోయారేమిటి మాష్టారూ! ఇలా రండి ఈ గదిలో ఉంది త్రివేణి" అంటూ గదిలోకి తీసుకొని వెళ్ళాడు.

లోపల గదిలో మంచం మీద పడుకొని ఉంది త్రివేణి. ఆ గదినిండా పసి పిల్లల ఫొటోలు వున్నాయి.

"వేణీ ఎవరొచ్చారో చూడు!" అంటూ లేపాడు.

"ఊ..." అంటూ నెమ్మదిగా కళ్ళు తెరిచింది త్రివేణి. ఎదురుగా సదాశివంగారిని చూడగానే ముందు కాసేపు ఏమీ అర్థం కాలేదు.

"ఏమిటి త్రివేణీ అలా చూస్తున్నావు! మీ నాన్నగారు. నిన్ను చూడాలని వచ్చారు" అన్నాడు విల్సన్.

"అమ్మా త్రివేణీ ఎలా ఉన్నావమ్మా" అంటూ దగ్గరగా కూర్చుని తలపైన చెయ్యి వేసారు సదాశివంగారు.

"నాన్నా" అంటూ ఆయన ఒళ్ళో తలపెట్టుకొంది త్రివేణి. కాసేపు మౌనం ఆవరించింది గదిలో. ఇన్ని రోజులూ తల్లిని, తండ్రిని చూడలేదనే బాధ, కూతురిని చూడలేదనే ఆవేదన కన్నీళ్ళ రూపంలో కరిగిపోయింది. రెండు కప్పులతో హార్లిక్స్ తీసుకొని వచ్చాడు విల్సన్.

"త్రివేణీ! ఏమిటిది చిన్నపిల్లలా! లే, లేచి హార్లిక్స్ తాగు. మాష్టారుగారూ! మీరూ తీసుకోండి" అంటూ కప్పు అందించి తనూ చిన్న టేబుల్ మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు.

"అమ్మ ఎలా ఉంది నాన్నా?" కొంచెం హార్లిక్స్ తాగి అడిగింది త్రివేణి.

"ఎలా ఉంటుందమ్మా నీ మీద దిగులుతో మనిషి సగమైపోయింది. ఈరోజు నీ పుట్టిన రోజని పిండి వంటలన్నీ చేసింది. నువ్వు తీసుకున్న నిర్ణయం మీ అమ్మకు పెద్ద దెబ్బమ్మా" అన్నాడు సదాశివం.

"మాష్టారు గారూ! మీ స్వంత విషయాల్లో కల్పించుకున్నందుకు క్షమించండి. త్రివేణి నన్ను పెళ్ళి చేసుకోవడం వల్ల మీకు బాధ కలిగింది. నిజమే అందుకు మమ్మల్ని క్షమించండి. కానీ ఒక్క విషయం ఆలోచించండి మాష్టారు గారూ. నేనూ, త్రివేణీ మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నాము కలిసి జీవించాలనుకున్నాము. ఆ విషయం త్రివేణి ముందుగా మీతో చెప్పింది. నేను మీ ఆస్తి చూసి త్రివేణిని ప్రేమించలేదు. నాకు తన వ్యక్తిత్వం నచ్చింది. అందుకే ఆమెను ఇష్టపడ్డాను. కానీ మీరంగీకరించలేదు. కారణం, నేను క్రిష్టియన్ని కాబట్టి. మాష్టారు గారూ, ఈ కులాలు మతాలనేవి పుట్టుకతో వచ్చినవా? మనిషి మతాన్ని సృష్టించాడు కాని మతం మనిషిని సృష్టించలేదు కదండీ. మా నాయనమ్మావాళ్ళు బ్రాహ్మణులు, మానాన్న మతం మార్చుకున్నాడు. ఒకవేళ పెళ్ళికి ముందు నేను హిందువుగా మారితే మీరు ఒప్పుకొనేవారా! ఒప్పుకోరు. నేను మిమ్మల్ని తప్పు పట్టడంలేదండీ. తరాల మధ్య అంతరాలు ఉండడం సహజం. మారుతున్న కాలంలోని మంచిని గ్రహించి దానికి తగినట్లుగా జీవిస్తే అందులోని సుఖాన్ని మనిషి పరిపూర్ణంగా అనుభవించగలడని నా అభిప్రాయం."

ఇంతలో బయట ఎవరో పిలవడంతో లేచి వెళ్ళాడు విల్సన్. అతను వెళ్ళిన వైపే ఆశ్చర్యంగా, ఆనందంగా చూస్తుండి పోయారు సదాశివంగారు. తన మనసులోని అభిప్రాయాన్ని సూటిగా ఎదుటి మనిషి మనసును నొప్పించకుండా ఎంత సున్నితంగా చెప్పాడు. "నాన్నా" పిలిచింది త్రివేణి.

"ఏమిటి నాన్నా ఆలోచిస్తున్నారు? ఆయన మీ మనసుని నొప్పిస్తే క్షమించండి." తండ్రి చేయి పట్టుకుంటూ అంది త్రివేణి.

"లేదమ్మా అతనేమీ తప్పుగా మాట్లాడలేదు. తరాల మధ్య ఈ సంఘర్షణ ఎప్పుడూ ఉండేదే" అన్నారు సదాశివంగారు.

"నాన్నా! మా పెళ్ళయి సంవత్సరమయ్యింది. ఈ సంవత్సరం రోజులలో నన్నేనాడూ ఆయన మతం మార్చుకోమనిగాని, చర్చికి రమ్మనిగానీ అడగలేదు. నా అంతట నేనే వస్తానని అన్నాను. ఆయన గుడికి వస్తారు. నేను చర్చికి వెళ్తాను. ఏ మతమైనా చెప్పేది ఒక్కటే"

అంది త్రివేణి.

ఈ లోపల విల్సన్ వచ్చాడు. "త్రివేణీ మా ఫ్రెండ్ రఘూ తెలుసుగా మెడికల్ రిప్రజెంటేటివ్. నీకు టానిక్స్ తెచ్చాడు. ఇవిగో రోజూ తీసుకోవాలి. మీనాన్న గారిని కూడా చూసావు. ఇక దిగులు పడకుండా వేళకు భోంచేయాలి సరేనా" అంటూ కూర్చున్నాడు.

"మాష్టారు గారూ! మతం అంటే 'ఇష్టం' అని అర్థం అనుకుంటాను. ఏకాగ్రత కోసం ఒక రూపాన్ని మనసులో ఊహించుకుని ఆమూర్తికి పూజలు చేయ డమే ఆచారం, సంప్రదాయం అని నా అభిప్రాయం. ఏ మతమైనా మనిషి ఔన్నత్యాన్నే కోరుతుంది. 'యెహోవా' అంటే ఒకడే దేవుడు అని అర్థం. చాలా మంది క్రీస్తు ఒక్కడే దేవుడు అనే అర్థంలో వాడుతున్నారు. కానీ ఈ ప్రపంచాన్ని కంటికి కనిపించని మానవాతీతమైన శక్తి ఒకటి నడిపిస్తోందని నా విశ్వాసం. ఆ శక్తే దేవుడని నా నమ్మకం. మనం ఒక్క నిముషం ఆలోచిస్తే క్రీస్తుకీ, కృష్ణుడికి పోలికలు కనిపించవూ? మా మతం గొప్పంటే మా మతం గొప్పని మతం పేరుతో మారణకాండ సృష్టిస్తున్నారు. ఏమిటో ఎక్కువగా మాట్లాడి విసిగించి నట్లున్నాను క్షమించండి" నవ్వుతూ అన్నాడు విల్సన్.

"లేదు బాబూ! నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం. ఒకరి అభిప్రాయాల్ని ఇంకొకరిపై రుద్దే హక్కు ఈ సమాజంలో ఎవ్వరికీ లేదు. ఉపాధ్యాయుడుగా ఎంతోమందికి విద్యాభిక్ష పెట్టినవాడిని. కుల మతాల గురించి అనర్గళంగా ఉపన్యాసాలు ఇచ్చినవాడిని. నా వరకూ వచ్చేసరికి నా ఆలోచనలు సంకుచితమయ్యాయి. ఒకే ఊళ్ళో ఉంటూ కన్నకూతురిని కూడా చూడడానికి ధైర్యం. చేయలేకపోయాను" అంటూ కూతుర్ని దగ్గరకి తీసుకున్నారాయన కన్నీళ్ళతో.

"మీరు బాధ పడకండి మాష్టారుగారూ! ఈ రోజుల్లో ఎంతోమంది ప్రేమనే పేరుతో క్షణికోద్రేకంతో జీవితాలను నాశనం చేసుకుంటుంటే మీవంటివారికి ప్రేమ వివాహాల మీద నమ్మకం లేకపోవడంలో తప్పులేదండీ" అన్నాడు విల్సన్.

"ఇంక నేను బయలు దేరతానమ్మా. ఆరోగ్యం జాగ్రత్త తల్లీ ఈ విషయం వింటే మీ అమ్మ ఎంత సంతోషి స్తుందో, ఈ రోజు నా మనసెంత హాయిగా వుందో తెలుసా! వస్తా బాబు. వీళ్ళమ్మ నాకోసం ఎదురు చూస్తుంటుంది" అంటూ లేచారు.

"మీ అమ్మాయికి అమ్మాయే కావాలట ఆడపిల్ల పుడితే 'ధరణీ' అని పేరు పెడుతుందట. ఎందుకో మీరే అడగండీ" నవ్వుతూ అన్నాడు విల్సన్.

"ఎందుకు తల్లీ?" కూతురి తల పైన చెయ్యివేసి అడిగారాయన.

"మనుషుల్లో కులాలు, మతాలు అని వైరుధ్యాలున్నా అందర్నీ మోసే భూమి ఒక్కటే కదనాన్నా ఏ మతం వాడైనా, కులం వాడైనా చివరికి అ భూమిలో కలిసి పోవాల్సిందేగా. అందుకే నీ మనుమరాలికి 'ధరణి' అని పెట్టుకోవాలనుకుంటున్నాను."

"మరి అబ్బాయి పుడితే?" కవ్వించాడు విల్సన్.

"గాంధీ" అంది వెంటనే.

వాళ్ళిద్దర్నీ ముచ్చటగా చూసుకున్నారు సదాశివంగారు.

"నేనిక వెళ్ళిరానా అమ్మా. ఆరోగ్యం జాగ్రత్త. మీ అమ్మ మనసు మారితే త్వరలోనే నిన్ను చూడ్డానికి వస్తుందిలే తల్లీ. బాబూ నువ్వు రామచంద్రా కాలేజీలోనే కదూ లెక్చరర్‌గా ఉండేది?" బయలు దేరబోతూ అడి గారు.

"అవునండీ. కామర్స్ లెక్చరర్‌గా ఉన్నాను." గేటు వరకూ వచ్చాడు విల్సన్.

"ఇక నువ్వుండు బాబూ! అమ్మాయి ఒక్కత్తే ఉందిగా! నేను వెళ్ళగలనులే" అంటూ అతని భుజం తట్టి ముందుకు నడిచారు సదాశివంగారు.

* * * * * *


"ఏమిటండీ ఇంత ఆలస్యమయింది?" అన్నం వడ్డిస్తూ అడిగింది పార్వతమ్మ. ఏం మాట్లాడ లేదు సదాశివంగారు. త్రివేణి దగ్గరికి వెళ్ళానంటే ఏవిధంగా అర్థం చేసుకుంటుంది? 'అందరూ ఒకటై నన్ను ఒంటరి దాన్ని చేసారంటూ' బాధపడదు కదా! ఆలోచిస్తున్నారు సదాశివంగారు. భర్త ముఖభావాన్ని చూసి ఇంకేం అడగ లేదు పార్వతమ్మ. మౌనంగా భోజనంముగించి పెరట్లో వాలుకుర్చీలో కూర్చున్నారు సదాశివంగారు. వంటిల్లు సర్దుకొని తలుపులన్నీ వేసి చేతిలో తాంబూలం పళ్ళెంతో వచ్చి భర్తకు దగ్గరలో తులసికోట గట్టుమీద కూర్చుంది పార్వతమ్మ.

"ఏమిటండీ అలా ఉన్నారు? ఒంట్లో బాగాలేదా? పరాశరంగారింటికి వెళ్ళారా?" తాంబూలం అందిస్తూ అడిగింది.

"లేదు పార్వతీ పరాశరం గారింటికి వెళ్ళలేదు." తాంబూలం అందుకొని అన్నారాయన.



దువ్వెన్నలలో మురికి జేరితే శుభ్రపరచ డానికి - బట్టలసోడాని వేడినీళ్ళలో కలిపి - ఆ మిశ్రమంలో దువ్వెన్నని కొంతసేపు వుంచండి.



వర్షాకాలంలో, ఆవనూనె కొద్దిగా బూట్ల లోపలి భాగంలో రాస్తే బూజు, ఫంగస్ చేరవు.

"మరి ఇంత ఆలస్యమయిందేం?" తనూ ఆకులకి సున్నం రాసుకుంటూ అడిగింది.

"అమ్మాయి దగ్గరకు వెళ్ళాను."

"అమ్మాయా! "ఏ అమ్మాయండీ" ఆకు మడుస్తూ అడిగింది.

"మన అమ్మాయి త్రివేణి ఇంటికి." ఆమె ఎలా రియాక్టవుతుందోనని గమనిస్తూ అన్నారు సదాశివంగారు.

తమలపాకులు మడుస్తున్న చేతులు ఆగిపోయాయి. "ఏమిటి మీరంటున్నది? మీరు, మీరు దానింటికి వెళ్ళారా! మన ఆశల్ని ఆశయాల్ని గాలికొదిలేసి దాని స్వార్థం అది చూసుకుంది. దానింటికి మీరెలా వెళ్ళారు? ఎందు కెళ్ళారు? చివరికి మీరూ నన్ను మోసం చేసారు. మీరంతా ఒకటైపోయారు. నన్ను మోసం చేసారు." ఆవేశపడిపోయిందామె. దుఃఖంతో మాట సరిగ్గా రావడంలేదు.

"ఆవేశపడొద్దు పార్వతీ, నేను చెప్పేది విను." ఆమె తలపై చెయ్యివేసి అనునయించారాయన. ఆమె ఏమీ మాట్లాడలేదు.

"త్రివేణి ఆరోగ్యం సరిగ్గా లేదు పార్వతీ, ఇప్పుడు గర్భవతిగా ఉంది. చాలా బలహీనంగా ఉంది. గుళ్ళో వాళ్ళాయన కనపడి చెబితే ఉండబట్టలేక వెళ్ళాను." అన్నారాయన.

'త్రివేణి గర్భవతా! నిన్న మొన్నటివరకు 'అమ్మా అమ్మా' అంటూ కొంగుపట్టుకొని తిరిగిన పిల్ల అమ్మ కాబోతోందా? తను అమ్మమ్మ కాబోతుందా?' ఆమె మనసు లోని కాఠిన్యపు పొరలు కరగడం ప్రారంభించాయి.

"అతను గుడికెందుకుకొచ్చాడు?"

ఆశ్చర్యపడ్డారు సదాశివంగారు.

విల్సన్‌ని 'వాడు' అనడమే గాని ఆమె 'అతను' అనడం తను విని ఎరుగడు. "మనపేరు మీద అర్చన చేయించడానికి వచ్చాడు." నమ్మలేనట్లు చూసింది పార్వతమ్మ.

"అవును పార్వతీ. కులమతాల కతీతమైనవి వాళ్ళ జీవితాలు. అనురాగం ఆప్యాయతలతో నిండింది ఆయిల్లు. పేరుకు తగ్గట్టే త్రివేణీ సంగమం లాగా మన అమ్మాయిలో ఎన్నో విశాల భావాలు నిండి ఉన్నాయి. నిన్ను చూడాలని ఆశపడుతోంది పార్వతీ" అన్నారాయన.

ఆమె ఏమీ మాట్లాడలేదు. చీరకొంగుతో కళ్ళు తుడుచు కుంది.

"నాకు తెలును పార్వతీ నీ మనసులో పట్టుదలకీ, ప్రేమకి మధ్య జరిగే సంఘర్షణని నేనర్థం చేసుకోగలను. అమ్మాయిని చూడాలని నువ్వెంత తహతహలాడుతున్నావో నాకు తెలుసు. కానీ పట్టుదలతో నీ మనసుని పాషాణంగా మార్చుకుంటున్నావు. త్రివేణి జ్ఞాపకాలతో ఆపాషాణం ఎక్కడ పగులుతుందోనని సంప్రదాయమనే సంకెళ్ళను తగిలించుకున్నావు. అవునా?" అడిగారాయన. భర్త కాళ్ళపై తలపెట్టుకుంది పార్వతమ్మ. వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఆలోచించుపార్వతీ! జీవితపు చివరి మజిలీలో ఉన్నాము. బ్రతికిన కొద్దిరోజులూ సంతోషంగా వుందాం. ఎందుకీ పంతాలు పట్టింపులు! జీవితం అంటే ఎన్నో ఒడుదుడుకులు ఉంటాయి. జీవితాన్ని మన చేతిలో ఉంచుకోవాలి. మన బ్రతుకు మనం బ్రతకడంలో ఇంకొకరికి భయపడాల్సిన అవసరం ఏముంది? త్రివేణి ఆడపిల్ల కాబట్టి ఇంతకాలం పట్టుదలగా ఉండగలిగావు. అదే మన అబ్బాయి ఈ పని చేసి ఉంటే ఇన్నిరోజులూ మాట్లాడకుండా, చూడకుండా ఉండలేము. ఎందుకంటే ఆర్థికంగా వాడే మనకు అండ కాబట్టి. ఒకవేళ త్రివేణికి బలవంతంగా వేరే పెళ్ళి చేసి, అది జీవితంతో రాజీపడ లేక ఏ అఘాయిత్యమో చేసుకొని ఉంటే జీవితాంతం ఆ పాపం మోయవద్దూ? త్రివేణి సంతోషంగా ఉంది. అబ్బాయి దాన్ని కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. మన అబ్బాయి ఉద్యోగరీత్యా దేశం కాని దేశంలో ఉంటున్నాడు. లంకంత ఇంట్లో నువ్వూ నేనూ ఒంటరిగా ఎన్నాళ్ళు ఉంటాం. త్రివేణికి పిల్లలు పుడితే వాళ్ళు రావడంతో ఇల్లు కళకళలాడదూ! సమాజం కుక్క లాంటిది పార్వతీ మనం భయపడినంతకాలం అరిచి బెదిరిస్తూనే ఉంటుంది. ఎదురు తిరిగితే తోక ముడుచు కుంటుంది. మనజీవితాలు మనవి. ఈ జీవితాల్లోని సుఖాన్ని మనసారా ఆస్వాదించడంలో ఎవరికీ భయ పడాల్సిన అవసరం లేదు. బాగా ఆలోచించు పార్వతీ. ఆరోగ్యరీత్యా ప్రస్తుతం త్రివేణి ఉండే పరిస్థితుల్లో ఆదు కోవడం నీధర్మం. అది చేసింది తప్పు కావొచ్చు. పిల్లలు తప్పు చేస్తే పెద్దవాళ్ళం క్షమించాలి. ఆలోచించుకో ఇందులో నా బలవంతం ఏమీ ఉండదు. నీ మనసుకెలా తోస్తే అలాచెయ్యి." మంద్ర స్వరంతో సదాశివంగారు మాట్లాడుతున్న మాటలు మంత్రాల్లాగా వినబడుతున్నాయి పార్వతమ్మకి.

మర్నాడు పూజ ముగించి లేస్తున్న సదాశివంగారు - "బజారుకెళ్ళి మంచి చీర, పూలు, పండ్లూ, తీసుకొని రండి. ఈ రోజు మంచిరోజు. అమ్మాయి దగ్గరికి వెళ్ళాలి" అంటున్న పార్వతమ్మని చూసి చిన్నగా నవ్వుతున్నారు. □